అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కడప పట్టణం మృత్యుంజయకుంటకు నాదెండ్ల సుబ్బన్న వృధ్యాప్య పింఛను మంజూరు చేయాలని అభ్యర్థించారు.

రాములోరి కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో భక్తులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. కల్యాణ ప్రాంగణం వద్ద భక్తుల కోసం చేపడుతున్న ఏర్పాట్లను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎం.రాం ప్రసాద్‌రెడ్డి, ఎస్.సవిత, వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ సి.శ్రీధర్, జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్, టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం, సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు, జెసి అదితి సింగ్ తదితర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలోని పరిపాలనా జరిగిన సమీక్షలో మంత్రి ఆనం మాట్లాడుతూ ఆగమ శాస్త్రం ప్రకారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పండుగకు ముత్యాల తలంబ్రాలు సమర్పించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని వెల్లడించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కోరారు. సిఎం వచ్చి వెళ్లేంత వరకు పోలీస్ యంత్రాంగం అప్ర మత్తంగా ఉండాలని కోరారు. హైవే సెక్టార్లలో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి అంబులెన్స్‌లను అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు వెలుపలికి సులువుగా వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేసి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్‌పితో సమన్వయం చేసుకుని పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది పటిష్ట బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కళ్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదము కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరు గుదొడ్లు, అదనపు పారిశు ధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమా వేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, కడప, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఎర్విన్, చిన్నయ్య, టిటిడి డిప్యూటీ ఇఒ నటేష్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిపిఒ రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఇ రమణయ్య, జిల్లా రెవెన్యూ, పోలీసు, హెల్త్, మెడికల్, జిల్లా, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

హంస వాహనంపై సీతారాముడు

హంసవాహనంపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి ఏడు గంటల నుండి హంసవాహనంపై శ్రీ సీతా రామలక్ష్మణులు భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహన సేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగ డుగునా కర్పూ ర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారు వేణుగాన అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శన మిచ్చారు ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరి గింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తి స్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకు ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. రాత్రి ఏడు గంటల నుండి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో హంస వాహనసేవ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న మంత్రులు, నాయకులు

మహానాడు స్థల పరిశీలనలో మంత్రులు

- నగర శివార్లలోని 3 ప్రాంతాలు పరిశీలన

ప్రజాశక్తి కడప అర్బన్

జిల్లాలో మే 27,28,29 తేదీల్లో నిర్వహించే మహానాడు నిర్వహణ ఏర్పాట్లకు అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, మంత్రులతో కూడిన మహానాడు కమిటీ జిల్లాలో పర్యటించింది. సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కడప జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి సవితమ్మ, మంత్రి అనగాని సత్యప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థలాలను పరిశీలించారు. నగర శివారు ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ సర్కిల్ ఔట్, ఆటోనగర్ గార్డెన్, ఎయిర్ పోర్టు వద్ద శాటిలైట్ సిటీకి దగ్గర ఉన్న ప్రాంతాల్లో మహానాడు ఏర్పాట్లకు వీలవుతుందా.. లేదా అని సమాలోచన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా మహానాడు నిర్వహించడం 43 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ఈ సారి కడపలో మహానాడు నిర్వహించాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగా కడపలో పర్యటించామని చెప్పారు. తాము పరిశీలించిన విషయాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతామన్నారు. టెక్నికల్ టీం కూడా పరిశీలనకు వస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోమారు కమిటీ పరిశీలనకు వస్తుందని పేర్కొన్నారు. అప్పుడు తుదినిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్యరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ లింగారెడ్డి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జీ భూపేష్‌రెడ్డి, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ముక్తియార్, బి.టెక్ రవి, అమీర్‌బాబు, మహానాడు నిర్వహణ జోనల్ కో-ఆర్డినేటర్లు, ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యవర్గం పాల్గొన్నారు.

ఊరి బడిని దూరం చేయొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీవో నంబర్ 117, 128 వల్ల కుదేలైన ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి ఈ ప్రభుత్వం చొరవ చూపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కడపలోని రాష్ట్ర అతిథి గృహం లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117, 128 జీవో నెంబర్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని అయితే ప్రాథమిక విద్యారంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీయడానికి సిద్ధమైందని తెలిపారు. అమలు చేయడంలో భిన్నమైన పద్ధతులను అవలంభించిన నేపథ్య గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం సరైంది కాదన్నారు. దీనివల్ల ఎంతోమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. 60 మంది పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలను దూరంతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ప్రస్తుత విలీన ప్రక్రియతో ముందుకు వెళితే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పాఠశాలల విలీన ప్రక్రియను ఆపివేసి ప్రజా ఆమోదయోగ్యమైన నిర్ణయాలను అమలుపరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కరిముల్లా, గోపీనాథ్ పాల్గొన్నారు.

రేపు బిషప్ పాల్ ప్రకాష్‌కు పట్టాభిషేకం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఈనెల 9న వైభవంగా నిర్వహించబోయే బిషప్ సగినాల పాల్ ప్రకాష్ పట్టాభిషేకం మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విరివిగా తరలిరావాలని క్యాథోలిక మేత్రాసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం మరియాపురం బిషప్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప డయాసిస్‌కు నూతన కాపరిగా విశ్వశ్రీ సభ కాపరి పోపు ఫ్రాన్సిస్ ద్వారా సగినల పాల్ ప్రకాష్ ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన పట్టాభిషేక మహోత్సవం మరియాపురం, సెయింట్ జోసెఫ్ హై స్కూల్ కంబ్లిస్ ప్రాంగణంలోని అరులయ్య వేదికపై నిర్వహిస్తారని తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా వాటికన్ నుంచి పోప్ దూత లియోఫోల్డ్ జిరెల్లి, ముఖ్య అతిధిగా, ప్రధాన అభిషేక పీఠాధిపతులుగా హైదరాబాద్ మేత్రాసనానికి చెందిన కార్డినల్ పూల అంతోని, సహాయ అభిషేక పీఠాధిపతులుగా బిషప్ డాక్టర్ గాలి బాలి, నెల్లూరు బిషప్ డాక్టర్ మోషేస్ డి ప్రకాశం పాల్గొంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు నుంచి దాదాపు 20 మంది బిషప్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో తిరుపతి విచారణ గురువు ఫాదర్ ఆనంద్, ఎర్రగుంట్ల విచారణ గురువు ఫాదర్ ఇట్టా మోజెస్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ లేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ : డిసిసి

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ రోజు ఆరోగ్యశ్రీ లేని దౌర్భాగ్య స్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉందని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి అన్నారు. తక్షణమే రూ.3500 కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తి మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజు రాష్ట్రంలో పేదలకు వైద్యం అందుబాటులో లేని స్థితిలోకి వచ్చిందన్నారు. బకాయిలు చెల్లించకుండా ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం కింద సేవలు కొనసాగించలేమని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ స్పష్టం చేసింది అన్నారు. గత నెల 7 న ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ రాసిన లేఖలోను ఏప్రిల్ 7 నుంచి వైద్య సేవలు కొనసాగించలేమని పేర్కొంది అని తెలిపారు. నెల రోజులు టైం ఇచ్చినా కూడా ఎటువంటి చర్య తీసుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా తక్షణమే రూ.3500 కోట్లు విడుదల చేయాలని, పేదల ఆరోగ్యం కాపాడాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో జమ్మలమడుగు అసెంబ్లీ సమన్వయకర్త సింగం శివ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, సయ్యద్ గౌస్‌పీర్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, మామిళ్ళ నరసింహులు, మామిళ్ళ బాబు, పాలగిరి శివ, శ్యామలమ్మ హరిప్రసాద్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -కడప అర్బన్

సమతుల ఆహారం, వ్యాయమం, మంచి జీవన శైలి, శారీరక శ్రమ, తగినంత నిద్ర, సమయానికి తిండి మనల్ని అనారోగ్యం నుంచి కాపాడతాయని రిమ్స్ నేత్ర వైద్యుడు డాక్టర్. జె.ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పైన ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కోరారు. ఒకప్పుడు అరుదుగా కనిపించిన మధుమేహం, హృద్రోగం నేడు సర్వ సాధారణం కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. తమ కళ్ళను కూడా కాపాడుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు. ఆరోగ్యం లేని జీవితం వ్యర్థమని తెలిపారు. కళాశాల ఎండి డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కె.రాజేశ్వరి విద్యార్థినులను అభినందించారు.

స్థానిక సమస్యలు పరిష్కరించే వరకూ

పోరాటం తప్పదు

- కార్పొరేషన్ ఎదుట ఆందోళనలో సిపిఎం నాయకుల హెచ్చరిక

కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పేదల నివసించే ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం తప్పదని సిపిఎం నాయకులు హెచ్చరించారు. నగరంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పాలకులు చెప్పిన మాటలు సామాన్య ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని విమర్శించారు. అభివృద్ధి కేవలం ప్రధాన రోడ్లకు, కోటిరెడ్డి సర్కిల్, 7 రోడ్ల సర్కిల్ మాత్రమే పరిమితమైందని తెలిపారు. విలీనమైన పంచాయతీల్లో అభివృద్ధి భూతద్దం పెట్టి వెతికినా కనపడడం లేదన్నారు. నగర శివారు ప్రాంతాలు రోడ్లు, డ్రెయినేజీ, మంచి నీటి సరఫరా, వీధిలైట్లు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కడప నగరంలో శాశ్వతమైన మంచినీటి సమస్యను పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని చెప్పారు. నగరంలో ఉన్న మృత్యుంజయకుంట, ప్రకాష్ నగర్, ఫరీదానగర్, ఎస్టేట్ 3,4 డివిజన్లలో చాలా కాలనీలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. వీటి అభివృద్ధి కోసం తక్షణమే అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ నగర్, రామకృష్ణ నగర్, మృత్యుంజయకుంట, ప్రకాష్‌నగర్, తిలక్ నగర్, ఆచార్ల కాలనీ ప్రాంతాల సమస్యల పరిష్కరించకపోతే భవిష్యత్తులో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, వెంకటేశ్వర్లు, శివకుమార్, వి.రవి, గోవిందు, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శివరాం, ఇమ్రాన్, నరసింహ, జకరయ్య, కృష్ణారెడ్డి, జార్జ్, శేఖర్, మహిళా సంఘం నాయకులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జమీల, సరిత, కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

అహ్మద్‌బాషాకు 14 రోజుల రిమాండ్

కడప కేంద్ర కారాగారానికి తరలింపు

వైద్య పరీక్షల కోసం అహమ్మద్ బాషాను రిమ్స్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

వైసిపి నాయకుడు, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి అంజాద్‌బాష తమ్ముడు ఎస్.బి అహ్మద్ బాషకు కడప కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కడప తాలూకా పోలీసులు సోమవారం మధ్యాహ్నం కడప సెకండ్ ఎడిఎం కోర్టులో అహ్మద్‌బాషాను హాజరు పరిచారు. ఈనెల 21వరకు రిమాండ్ విధించారు. అహ్మద్‌బాషా వివిధ కేసుల్లో నిందితుడిగా ఉండగా ఆదివారం తెల్లవారు జామున కువైట్‌కు వెళ్లేందుకు ముంబాయి ఎయిర్‌పోర్టుల ఉన్న సమయంలో కడప పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. పోలీసులు ముంబాయి నుంచి సోమవారం తెల్లవారు జామున కడపకు తీసుకు వచ్చారు. కడప నగర శివారుల్లోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో 8 గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం ఆయనకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇన్‌స్పెక్టర్ తారాంరెడ్డి, తాలూకా ఎస్ఐ నాగ తులసి ప్రసాద్ సమక్షంలో వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అహ్మద్ బాషను కడపకు తీసుకొచ్చారన్న విషయం తెలుసుకున్న సోదరుడు, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి అంజాద్‌బాష రిమ్స్‌లో పరామర్శించారు. అనంతరం పోలీసులు కడప రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా సిఆర్‌పిసి 326 కింద న్యాయమూర్తి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు అహమ్మద్ బాషాను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని

ప్రజాశక్తి - కడప

రాష్ట్రవ్యాప్తంగా 54 మంది జిల్లా జడ్జిలు, జిల్లా అదనపు జడ్జిలను బదిలీ చేశారు. వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి. యామిని నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న యామిని కడపకు బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జి .శ్రీదేవి అనంతపురంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కడపలోని ఆరవ అదనపు జిల్లా (ఫ్యామిలీ కోర్టు) జడ్జిగా పనిచేస్తున్న షేక్ ఇంతియాజ్ అహ్మద్ విజయవాడ జిల్లా కోర్టులో 14 అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కోర్టులో పోక్సో కోర్టు జడ్జ్ గా పని చేస్తున్న ఎన్. శాంతి కడపలోని ఆరవ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

సవరణ బిల్లును రద్దు చేయించి తీరుతాం

- ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయించి తీరుతామని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. సోమ వారం మచిలీపట్నంలోని రాజుపేట షాది ఖానా నుంచి ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో వివిధ ముస్లిం సంఘాలు, సిపిఎం, సిపిఐ చేపట్టిన సవరణ బిల్లుకు వ్యతిరేక భారీగా ర్యాలీని నిర్వహించారు. ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని కోనేరు సెంటర్ వరకు ర్యాలీని జయప్రదంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదించి ముస్లిం సమాజ ఆత్మాభిమానానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముస్లింల ఓట్లతో గద్దెనెక్కి సవరణ బిల్లుకు మద్దతు తెలపడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. వీరు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. సవరణ రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

తనపై మహేశ్వరరెడ్డి భార్య, చెల్లెళ్లు, కూతుర్లు దాడి చేశారని, వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని సయ్యద్ ఇబ్రహీం కోరారు. సోమవారం ఎస్‌పికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో రూ. 30 లక్షలు మహేశ్వరరెడ్డి వద్ద అప్పు తీసుకున్నామని పేర్కొన్నారు. 2019లో విడతల వారీగా చెల్లించాలని తెలిపారు. రూ.1.50 వడ్డీ డబ్బు బకాయి పడ్డామని చెప్పారు. బాండ్లు ఇవ్వమని అడిగితే డబ్బు ఇచ్చి బాండ్ తీసుకోమన్నారని పేర్కొన్నారు. తనకు పక్షవాతం వచ్చి అనారోగ్యంతో పడిపోయానని చెప్పారు. రెండు సంవత్సరాల పాటు కరోనా రావడంతో వడ్డీ డబ్బులు చెల్లించలేకపోయానని తెలిపారు. మహేశ్వర్ రెడ్డి ఏనాడు తనను డబ్బు అడగలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 28న మహేశ్వర్ రెడ్డి భార్య, చెల్లెళ్లు, కూతుర్లు చెన్నూరు బస్టాండ్ వద్ద తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సిసి ఫుటేజ్ పరిశీలించి కేసు నమోదు చేయాలని కోరారు.

ఉర్దూ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలి : 'రూట'

ప్రజాశక్తి - కడప అర్బన్

2001 సంవత్సరంలో సిఎం చంద్రబాబు నాయుడు ఉర్దూ భాషాభివృద్ధి కోసం రోష్ని స్కీం ప్రారంభించి, రూరల్, అర్బన్ మైనార్టీ పరిసర ప్రాంతాలలో దాదాపు 300 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలని రూట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ హుసేన్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు అబ్దుల్ మునాఫ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ ఏరియాలలో కనీసం 500 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు, ప్రతి పాఠశాలకు రెండు ఉర్దూ ఎస్‌జిటి పోస్టులతో సహా ప్రారంభించాలని చెప్పారు. 1997 సంవత్సరంలో సిఎం చంద్రబాబు నాయుడు స్పెషల్ ఉర్దూ డిఎస్‌సి నిర్వహించి దాదాపు 1000 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో మెగా డిఎస్‌సిలో భాగంగా స్పెషల్ ఉర్దూ డిఎస్‌సి నిర్వహించి ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు.

పెండింగ్ వేతనం ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రయివేట్ విద్యా సంస్థలలో పని చేస్తున్న అధ్యాపకులకు 12 నెలల వేతనం చెల్లించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థల యాజమాన్యాలు అందులో పని చేస్తున్న అధ్యాపకులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని పేర్కొన్నారు. శ్రమకు తగ్గ వేతనం లేక ఉపాధ్యాయులు సతమతం అవుతున్నారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ర్యాంకులు రావాలన్నా, స్కూల్స్, కళాశాలల్లో అడ్మిషన్‌లు పెరగాలన్నా కీలక భూమిక అందులో పని చేస్తున్న సిబ్బందిదే అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత లేకుండా సంవత్సరాల తరబడి పాఠశాల అభివృద్ధి కోసం పనిచే స్తున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలైన చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి అడ్మిషన్లు చేయకపోతే ఉద్యోగం ఉండదని, ఇంక్రిమెంట్లు ఉండవని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమైన ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలు ఆలకించి వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలి

ప్రజాశక్తి-అట్లూరు

రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పరీక్షల తేదీ ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డివైఎఫ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఛలో విజయవాడకి పిలుపునిస్తామని జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇంతవరకు పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. ప్రతిపక్షంలో యువగలంలో నారా లోకేష్ ఇచ్చిన హామీలకు ఇంతవరకు అతీగతీ లేదని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని చెప్పారు. తక్షణమే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ అట్లూరు మండల నాయకులు శ్రీకాంత్, భాను, విష్ణు, అజయ్ పాల్గొన్నారు

క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ ఇందిరానగర్ యూత్

ప్రజాశక్తి -కడప అర్బన్

వేటూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి క్రికెట్ టోర్నమెంట్ ఇందిరానగర్‌లో నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు జట్లు తలపడ్డాయి. పోటీల్లో రన్నర్స్, విన్నర్స్ జట్టును కప్పులు, మెడల్స్, శాలువాలతో సత్కరించారు. రన్నర్స్‌గా సుగాలి తండా జట్టు, విన్నర్స్‌గా ఇందిరానగర్ యూత్ నిలిచారు. కప్పులు స్థానిక రామాలయం గుడిలో ఏటూరి కుటుంబం, వారి అనుచరులు అందజేశారు. రన్నర్స్ కెప్టెన్‌గా చిన్న, విన్నర్స్ కెప్టెన్ బన్నీ కప్ అందుకున్నారు. ఏటూరు రామచంద్రారెడ్డి రన్నర్స్‌కు కప్పుతో పాటు నగదు రూ.8116, విన్నర్స్‌కు రూ .15116 నగదుగా అందించారు. ఈ సందర్భంగా ఏటూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ ఇటువంటి సాంస్కృతిక, గేమ్స్, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏటూరి కుటుంబ సభ్యులతో పాటు వాల్మీకి సంఘ నాయకులు జక్కల శంకరయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాజమండ్రిలో జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగి వేమన విశ్వవిద్యాలయం, లలిత కళా విభాగం విద్యార్థుల చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. వైవీయూ విద్యార్థుల పెయింటింగ్స్‌ను సందర్శకులు మెచ్చుకుని కొనుగోలు చేశారు. ప్రతిభ చూపిన వైవీయూ బిఎఫ్ఏ విద్యార్థి ముత్యంను రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ శాలువా కప్పి అభినందించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలితకళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు, అధ్యాపకులు సి.హెచ్. వెంకటేష్, బి.ఈరప్ప ప్రదర్శనకు మార్గదర్శకం వహించారు. విద్యార్థులు చూపిన ప్రతిభ పట్ల విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘు నాథ రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

సేవా కార్యక్రమాల్లో ఆర్‌టిడి కళాశాల

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సేవా కార్యక్రమాల్లో రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ముందుంటుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వేసవికాలంలో దాహం తీర్చేందుకు మంచినీటితోపాటు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు, ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎఐ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీతాలకు నోచుకోని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది మార్చి నెల జీతాలకు నోచుకోలేదు. వేంపల్లె పరిధిలో ఉన్న 8 గ్రామ సచివాలయాల్లో 70 మంది సిబ్బంది పని చేస్తున్నారు. మార్చి నెల జీతం మంజూరు కాలేదని సిబ్బంది వాపోతున్నారు. వేంపల్లె పరిధిలో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బందికి వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యదర్శి హెడ్‌గా ఉన్నారు. గ్రామ సచివాలయంలో పని చేస్తున్న సిబ్బందికి ఉన్నతస్థాయి అధికారి అయిన పంచాయతీ కార్యదర్శి జీతాలను ప్రతి నెల చెల్లించడం జరిగితే, వేంపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ఇఒగా ఏ అధికారి రాలేదు. దీంతో గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు చేసేందుకు వీలు లేకుండా పోయింది. సోమవారం ఎంపిడిఒను గ్రామ సచివాలయ సిబ్బంది కలిసి జీతాలు విషయంపై విన్నవించారు. జీతం రాకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వెంటనే వేంపల్లె పంచాయతీకి కార్యదర్శిని నియమించి సకాలంలో సచివాలయం సిబ్బందికి జీతాలు వచ్చేలా అధికారులు సహకరించాలని కోరారు.

సిఐ చాంద్‌బాషాను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

అర్బన్ సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అర్బన్ సిఐగా చాంద్‌బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసింవలి, టిడిపి నాయకులు కంబల్లె గంగాధర్ రెడ్డి, షేక్ సమద్ కలిసి సత్కరించారు. అనంతరం సిఐ చాంద్‌బాషా మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూస్తామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

సిఐ నర్సింహులు

మండలంలోని ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామని సిఐ టి.నరసింహులు పేర్కొన్నారు. బదిలీల్లో పులివెందుల సిఐగా పని చేస్తున్న ఆయన వేంపల్లెకు వచ్చారు. ఆ మేరకు సోమ వారం వేంపల్లె సిఐగా టి.నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యక లాపాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతో మండలంలో శాంతి భద్రతలను కాపాడుతానని తెలిపారు. సిఐగా స్వీకరించిన నరసింహులుకు పోలీసులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

అంకాలమ్మ తిరుణాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాయలసీమలో ప్రముఖంగా పేరుగాంచిన దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వైసిపి నాయకులు, గ్రామ సర్పంచు రెడ్యం రామకృష్ణారెడ్డి ఆ పనులు చేపట్టారు. రహదారి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించడం, ఆలయ ప్రాంతం వరకు వివిధ ప్రాంతాల్లో చెడిపోయిన వీధి దీపాలను గుర్తించి బాగు చేయనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. తిరుణాల ముగిసే వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఆ మేరకు విద్యుత్ శాఖ అధికారులను తాను కోరనున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో మరో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యూడి బంగ్లా సమీపంలో నివాసం ఉంటున్న కల్లూరు సౌభాగ్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో సోమవారం మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సిఐ మోహన్ విలేకరులతో మాట్లాడుతూ.. కల్లూరు సౌభాగ్యపై దాడి చేసి హత్యయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను కడప-కర్నూల్ జాతీయ రహదారి రావులపల్లె రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. కడప నగరం శంకరాపురానికి చెందిన కొప్పోలు సూర్య చంద్రారెడ్డి, చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రఫీ (డ్రైవర్) సౌభాగ్యపై దాడికి దిగినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

దొంగతనం కేసులో మరో వ్యక్తి..

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఫిబ్రవరి 9న రాత్రి ఆర్‌టిపిపి క్వార్టర్స్‌లో తాళాలు వేసి ఉన్న ఆరు ఇళ్లల్లో చోరీ జరిగింది. ఆ మేరకు ఎస్ఐ తిమోతి కేసు నమోదు చేసి విచారించారని తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ముఠా ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ముఠాలోని ఒక వ్యక్తిని కొత్తపల్లె క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. గణపతి దావర్ అనే వ్యక్తి గొర్రెల కాపరిగా పని చేస్తుండేవాడు. దుర్వ్యసనాలకు బానిసై ఒక ముఠాగా ఏర్పడి పెద్దపెద్ద పరిశ్రమలు, తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలు చేసేవారని తెలిపారు. ఇంకా ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందని సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తిమోతి, ఎఎస్ఐ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ఎమ్మెల్సీని చుట్టుముట్టిన వివేకానంద కాలనీ వాసులు, రెండ్రోజుల్లో పరిష్కరిస్తామని హామీ

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని ముట్టడించిన మహిళలు

ప్రజాశక్తి - వేంపల్లె

పదిరోజులుగా తమకు తాగునీరు రావడంలేదని స్థానిక వివేకానందరెడ్డి (రెడ్డయ్య) కాలనీ మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వెళ్లేందుకు కాలనీలోని మహిళలు ఖాళీ బిందెలు, చిన్నపిల్లలతో కడప రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కారును చుట్టుముట్టారు. ఎమ్మెల్సీ కారు దిగారు. తమ సమస్యను మహిళలు ఎమ్మెల్సీకి వివరించారు. వివేకానంద రెడ్డి కాలనీలో ఉన్న వారందరూ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, అలాంటి కాలనీలో వేసవిలో తాగునీటి కోసం కష్టాలు పడుతున్నట్లు మహిళలు వాపోయారు. పనులకు పోయి వచ్చిన రెండు వందల కూలి నీటి కోసమే ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని బాధపడ్డారు. ఉగాది పండుగ నుండి సక్రమంగా తాగునీరు కుళాయిలకు రాకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చు కోవాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు వెళ్లకుండా ప్రతి రోజూ నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఓట్లు కోసం మాత్రం నాయకులు వస్తారని తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని చెబితే మాత్రం ఒక్కరూ కన్నెత్తి చూడడం లేదని మహిళలు వాపోయారు. పంచాయతీ సిబ్బందిని తాగు నీటి సరఫరాపై ప్రశ్నిస్తే మోటర్ చెడిపోయిందని ప్రతిరోజూ చెప్పడమే తప్ప, తాగునీటిని మాత్రం సరఫరా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చంటి బిడ్డలను వేసుకొని తాగునీటి కోసం వెళ్లాల్సిన పరిస్థితి దాపు రించిందని వాపో యారు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో కూడ అర్థం కావడం లేదన్నారు. కాలనీలో చేతి బోరు అయినా వేసి మహి ళలకు నీటి కష్టాలను తొల గించాలని కోరారు. అరకొర ట్యాంకర్లు పెట్టడంతో నీటి కోసం మహిళల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుందన్నారు. కాలనీ సమీపంలో ఉన్న హాస్టల్ వరకు నీరు వస్తుందని పై తట్టు ప్రాంతానికి మాత్రం రావడం లేదని తెలిపారు.

ఖాళీ బిందెలు, చిన్నపిల్లలతో రోడ్డెక్కిన మహిళలు

తాగునీటి సరఫరా చేసే సిబ్బందిని కూడా మహిళలు నీలదీశారు. రెండురోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి చెప్పి వెళ్లిపోయారు.

పోటాపోటీగా వైసిపి, టిడిపి ట్యాంకర్లతో నీటి సరఫరా

స్థానిక వివేకానంద రెడ్డి (రెడ్డయ్య కాలనీ)లో నీటి సమస్య ఉండడంతో పోటాపోటీగా వైసిపి, టిడిపి (ఎమ్మెల్సీ గ్రూపు) నాయకులు నీటి ట్యాంకర్లును పెట్టి సరఫరా చేశారు. సోమవారం వివేకానందరెడ్డి కాలనీ మహిళలు నీటిని సరఫరా చేయాలని రోడ్డు ఎక్కి నిరసన తెలిపారు. విషయాన్ని వైసిపి ఎస్‌సి సెల్ మండల కన్వీనర్ కమతం రాజా, వార్డు మెంబరు గణేష్ ప్రసాద్ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్సీ గ్రూపునకు చెందిన టిడిపి నేతలు కూడా విషయం తెలియడంతో అటు ఎమ్మెల్సీ, ఇటు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆదేశాలు మేరకు కాలనీ ప్రజలకు నీటి ట్యాంకర్లును పంపి సరఫరా చేశారు. కాలనీలో బోరు వేస్తామని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ పోయిన మోటర్‌ను బాగు చేసి నీటిని సరఫరా చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న వైసిపి నేతలు

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ఖాజీపేట

మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అయేషా సుల్తానా పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయేషా సుల్తానా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల ద్వారా వైద్య రంగంలో గణనీయమైన పురోగతి సాధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి, స్టాఫ్‌నర్స్ సుప్రజ, ఎఎన్ఎంలు వెంకటసుబ్బమ్మ, సునీత, ఆశా సిబ్బంది ఝాన్సీ, చంద్రకళ, రాజేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

తొండూరు : స్థానిక 2వ అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య అవగాహన కల్పించారు. మహిళలతో ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పుల్లమ్మ, శుక్రు, కళావతి, అంగన్వాడీ కార్యకర్త గురుతేజ, ఆశా కార్యకర్త, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

తొండూరులో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - వేంపల్లె

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం తెలపడం రాజ్యాంగ విరుద్ధమని వైసిపి మండల ఉపాధ్యక్షుడు మునీర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దేశంలోని అన్ని మతాలకు సమాన చట్టం వర్తిస్తుందన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా వ్యవహరించడం చాలా దారుణమన్నారు. దేశంలో ఉండే ముస్లిం సమాజం, సెక్యులర్ హిందువులు, దళిత సమాజం కూడా ఈ సవరణ బిల్లును వ్యతిరేకించడం సంతోషదాయకమన్నారు. వక్ఫ్ ఆస్తులకు 1995లోనే కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి తూట్లు పొడుస్తూ ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా అర్ధరాత్రి చట్టాలు తీసుకొని రావడం బిజెపికే చెల్లిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉండే తెలుగుదేశం అధ్యక్షులు, సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ముస్లింల ఆత్మీయ సమావేశాల్లో మాట్లాడుతూ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ముస్లిం మైనార్టీలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. చెప్పిన మాట ప్రకారం వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన వైసిపికి ముస్లింలు రుణ పడి ఉంటారన్నారు. విలేకరుల సమావేశంలో వైస్ ఎంపిపి బాబా షరీఫ్, ఎంపిటిసి హబీబ్, మైనారిటీ నాయకులు నిషార్, ఖదిరుల్లా పాల్గొన్నారు.

నీటి పంపింగ్ నిలిపివేయాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాలలో అక్రమంగా జరుగుతున్న నీటి పంపిణీ నిలిపివేయాలని గ్రామస్తులు తహశీల్దార్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామ సచివాలయం సమీపంలోని బెళకు గుంత నుంచి రమణారెడ్డి అనే వ్యక్తి నీటిని అక్రమంగా పంపింగ్ చేస్తున్నారని, దీని వల్ల బోర్లలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని విన్నవించారు. వెంటనే స్పందించి అక్రమంగా నీటి పంపింగ్ నిలిపేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఎంఆర్ఎఫ్ కుటుంబానికి ఆసరా

వేంపల్లె : బాధిత కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరానిస్తుందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంఘం వీధిలో నివాసం ఉంటున్న నామా శ్రీనివాసులు ఇంటికి సోమవారం ఎమ్మెల్సీ విచ్చేశారు. అనంతరం నామా శ్రీనువాసులు క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతుండడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన (ఎల్‌ఒసి)కు చెందిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్సీ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జివి రమణ, డివి సుబ్బారెడ్డి, ఆర్‌వి రమేష్, జయ చంద్రారెడ్డి, మల్లంగి గోపాల్‌రెడ్డి, మల్లంగి భాస్కర్ రెడ్డి, ప్రకాష్, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, ఇడుపులపాయ పోతిరెడ్డి శివ, కావలి భానుకిరణ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ సిబ్బందిచే నిర్వహించనున్న ఉచిత శిక్షణా కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ప్రిన్సిపల్ డాక్టర్ కెవి సుబ్బారావు తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సులలో చేరుటకు రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణా మండలి వారిచే ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 15గా నిర్ణయించారన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంచుతూ విద్యార్థులు రాబోయే కొద్దిరోజులు శ్రద్ధగా శిక్షణపొంది ప్రవేశ పరీక్షలో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. నిపుణులైన అధ్యాపకులచే నిర్వహించబడుచున్న ఈ శిక్షణా కార్యక్రమానికి విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు 47 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ఉపాధ్యాయులు డాక్టర్ హెన్రీ థామస్, శోభావతి, బేబీ శాలిని, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాల ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2008-09వ సంవత్సరంలో 10తరగతి చదువుకున్న విద్యార్థుల ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో సోమ వారం సరస్వతిదేవి విగ్రహాన్ని అర్చకులు మురళి శర్మ పూజ నిర్వహించి ప్రతిష్ట చేశారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మాయపల్లెలో బేస్‌మెంట్ కూల్చివేత

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని తిమ్మాయపల్లె గ్రామ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో రేకలకుంట మహబూబ్ బీకి చెందిన బేస్‌మెంట్‌ను సోమవారం అధికారులు కూల్చేశారు. బాధితురాలు వివరాల మేరకు.. సర్వే నెంబరు 77/3లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. ఈ క్రమంలో పట్టా నెంబరు 55 పొందిన తాను ఈ స్థలంలో బేస్‌మెంట్ నిర్మించుకున్నారు. 2021లో ఈ స్థలం తనది కాదని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిందని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కోర్టుకు వేసి ఇంటి నిర్మాణ పనులు ఆగేలా చేశారని ఆమె పేర్కొంది. అప్పటి నుంచి ఉన్న బేస్‌మెంట్‌ను సోమవారం ఈ స్థలం తనది కాదని, తన వద్ద ఉన్న పట్టా నకిలీదని.. రెవెన్యూ, పంచాయతీ, పోలీసులు, అధికారులు పర్యవేక్షణలో జెసిబి యంత్రంచే కూల్చేశారని వాపోయారు. రెండు సెంట్లలో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు ఎలా సరిపోతుందని బాధితురాలు ప్రశ్నించారు. డిప్యూటీ తహశీల్దారు కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. హై కోర్టు ఆదేశాల మేరకు తిమ్మాయపల్లె ఇందిరమ్మకాలనీలో పట్టా నెంబరు 55లోని స్థలంపై విచారించామన్నారు. దీనిని అప్పటి రెవెన్యూ అధికారులు అంగన్వాడీ కేంద్రానికి కేటాయించారని, ఈ పట్టాను వ్యక్తిగతంగా ఎవరికీ ఇవ్వలేదని తెలిపారు.

ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే ఆరాటం

జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శివచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తన ఉనికి కోసం ఆరాట పడుతున్నారని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. ఇతరులపై అసత్య ఆరోపణలు చేస్తూ తన ఉనికి కోల్పోకుండా పాటుపడుతున్నారని అన్నారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని కనుసన్నల్లో నడిపించుకుని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నీ అధీనంలో ఉంచుకొని అరాచక పాలన చేశావన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిపై నిందలు వేయడం సరి కాదన్నారు. ఇప్పటికైనా అసత్య పరోపణలు మానుకొని ప్రజలకు పనికొచ్చే సమస్యలపై స్పందించాలన్నారు.

కొత్తపల్లి ఒక వార్డు ఉప ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలు ఛీ కొడితే భంగపాటుకు గురి కాలేదా అన్నారు. కేవలం ఉప సర్పంచ్ కోసం ఇంత నీచానికి దిగజారడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఐదవ వార్డు కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ మునీర్, రాజుపాలెం మాజీ జెడ్పిటిసి భాస్కర్, పోట్లు లక్ష్మిరెడ్డి, పగిడాల దస్తగిరి పాల్గొన్నారు.

కాలువలను పరిశీలిస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

పాపాగ్నికి కృష్ణా జలాలను తెప్పించేందుకు కృషి

- టిబిపిహెచ్ఎల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజల దాహార్తి తీర్చేందుకు వేంపల్లెలోని పాపాగ్ని నదికి కృష్ణా జలాలను తెప్పించేందుకు కృషి చేస్తానని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ (టిబిపిహెచ్ఎల్) చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. పాపాగ్ని నదికి కృష్ణా జలాలను విడుదల చేసేందుకు మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ పరిధిలో ఉన్న పిబిసి కాలువలను సోమవారం ఆయన టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి, పిబిసి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జోగిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను విడుదల చేసేందుకు తాళ్లపల్లె నుండి ముచ్చుకోన, నేలవరం తండా ప్రాంతాల్లో ఉన్న పంపుహౌస్‌లను, కాలువలను పరిశీలించామన్నారు. ఇది విజయవంతమైతే సాగునీటి, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. త్వరితగతిన కృష్ణా జలాలు తెప్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల కలలను సహకారం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహమ్మద్ ఇనాయతుల్లా, వేమాకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు బోయపల్లి ప్రసాద్‌రెడ్డి ఆయన కుమారుడు కార్తీక్‌రెడ్డి రూ.50వేలు ఆర్థికసాయం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులురెడ్డి తెలిపారు. పాఠశాల ప్రహరీ, దేశ నాయకుల చిత్రపటాలను వేయించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రసాదరెడ్డిని ఉపాధ్యాయులు కోరారని తెలిపారు. స్పందించిన ప్రసాద్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ఆర్థికసాయం చేశారన్నారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థులు, దాతలు పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి పాల్గొన్నారు.

30లోపు చెల్లిస్తే పన్నులపై ఐదు శాతం రాయితీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

పులివెందుల పురపాలకకు సంబంధించి ఇంటి, ఖాళీ జాగా పన్నులపై 5 శాతం రాయితీ పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ రాము డు తెలి పారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ భవన యజ మానులకు, ఖాళీ స్థల యజమానులకు 2025-26 ఏడాదికి మీరు చెల్లిం చవ లసిన పన్నులు ఏక మొత్తంలో చెల్లించి 5 శాతం రాయితీ పొంద వచ్చన్నారు. ఈ అవకాశం ఈనెల 30వరకు ఉంటుం దన్నారు. పట్టణ ప్రజలు ఈ సదవకాశాన్ని విని యోగించుకొని పన్నులు చెల్లించాలన్నారు. పురపాలక సంఘ కార్యాలయ కౌంటర్, వార్డు సచివాలయం, ఆన్‌లైన్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ సిడిఎంఎ.జీవోవి.ఇన్), పురమిత్ర యాప్‌లో చెల్లించవచ్చన్నారు. సకాలంలో పన్ను చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట : మండల పరిధిలోని పత్తూరు వద్ద కడపకు వెళ్లే ప్రధాన రహదారికిరువైపులా వంతెనకు రక్షణ కూడా లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆ ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వంతెనకు ఓ వైపు రక్షణ గోడ లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళినా చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు లడ్డు బాషా, అభి, వెంకీ, గౌస్ పాల్గొన్నారు.

సిఎస్ఐ క్యాంబెల్ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా రవీంద్ర

- న్యాయం చేయాలంటూ ప్రస్తుత సూపరింటెండెంట్ సతీమణి ప్రత్యూష ధర్నా

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో 100 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన క్యాంబెల్ హాస్పిటల్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.పి.రవీంద్రను పాస్టర్స్ సోమవారం నియమించారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రెవ.ఐజక్ వరప్రసాద్ ఆదేశాల మేరకు రవీంద్రను రాయలసీమ డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ రెవ. సాల్మన్‌బాబు నియమించారని పలువురు బిషప్‌లు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి రవీంద్రను అభినందించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రవీంద్రను పలువురు పెద్దలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు అభినందించారు. ఇదిలా ఉంటే.. ఇది వరకు ఉన్న సిఎస్ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టన్ రాజు సతీమణి డాక్టర్ ప్రత్యూష సిబ్బందితో కలిసి ధర్నాకు దిగారు. బిషప్ లేకుండా ఆర్డర్ కాపీ రాకుండా రవీంద్రను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఆస్తుల పరిరక్షణ కోసం ఈ ధర్నా చేస్తున్నామన్నారు. స్వార్థపూరిత రాజకీయాలను వదిలేసి భయం లేకుండా సిబ్బంది అందరూ ముందుకు రావాలని కోరారు.

ధర్నాలో సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ ప్రత్యూష

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE : PRODDATUR

O.S.No. 7/2024

S.N.Praveen Kumar Reddy, S/o Gangi Reddy, Flat No.301, Plot No.20 & 21, Brundavan Apartments, Beside Sai Sanskruthi School, Anjaneya Nagar, Moosapet, Hyderabad- Ranga Reddy (Dt). **...Plaintiff**

Vs

1. S.N. Gangi Reddy & 5 Others. **...Defendants No.5**

To,
D5. Smt. Kandula Anitha, W/o K.Malleswara Reddy, D.No.1/111, Machupalle (V), Sidhout (M), Kadapa (D).

5వ ప్రతివాదికి సమన్

పై నెంబర్ దావాను వాది ప్రతివాదులపైన భాగపరిష్కారం కొరకు దావా దాఖలు చేసి వున్నాడు. అట్టి దావాలో 5వ ప్రతివాది అయిన నీవు పై రాజశ్రీ కోర్టులో 25.4.2025వ తేదిన ఉ॥10.30 ని॥లకు నీవు గానీ, నీ తరపున న్యాయవాది గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 25.4.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

ఎమ్.సురేష్ కుమార్
కె. వెంకట హరి
అడ్వకేట్స్, కడప. ప్రొద్దుటూరు.
సెల్: **9440756088.**

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, PRODDATUR

I.A.No. 214/2024
O.S.No. 7/2024

S.N.Praveen Kumar Reddy, S/o Gangi Reddy, Flat No.301, Plot No.20 & 21, Brundavan Apartments, Beside Sai Sanskruthi School, Anjaneya Nagar, Moosapet, Hyderabad- Ranga Reddy (Dt). **...Petitioner/Plaintiff**

Vs

1. S.N. Gangi Reddy & Others. **...Respondents/Defendants**

To,
R5. Smt. Kandula Anitha, W/o K.Malleswara Reddy, D.No.1/111, Machupalle (V), Sidhout (M), Kadapa (D).

5వ రెస్పాండెంట్‌కు నోటీసు

పై నెంబర్ పిటిషన్‌ను పిటిషనరు రెస్పాండెంట్స్ పైన ఇంజక్షన్ కొరకు పిటిషన్ దాఖలు చేసి వున్నాడు. అట్టి పిటిషన్‌లో 5వ రెస్పాండెంట్ అయిన నీవు 25.4.2025వ తేదిన ఉ॥10.30 ని॥లకు నీవు గానీ, నీ తరపున న్యాయవాది గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 25.4.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

ఎమ్.సురేష్ కుమార్
కె. వెంకట హరి
అడ్వకేట్స్, కడప. ప్రొద్దుటూరు.